క్లుప్తంగా

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన



సదుం: మండలంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నేడు బుధవారం పర్యటిస్తారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజలతో సమావేశమై సమస్యలపై వినతులు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



పాతపేటలో కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు(పులిచెర్ల): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాతపేట, వీకేపల్లి పంచాయతీల్లో వివిధ రకాల పంటలను అధికారులు పరిశీలించారు. పంటలకు ఈకేవైసీ తప్పక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసులు, వ్యవసాయ శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు, దినేష్, గణేష్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆశా సిబ్బంది

సదుం: మండలంలోని దిగువ జాంద్రపేటకు చెందిన ఆశా కార్యకర్త హరినాగమ్మ కుమారుడు చంద్రశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈనేపథ్యంలో మండలంలోని సహచర ఆశా కార్యకర్తలు, చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో ఆమెకు రూ.17 వేల ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. ఆశా నోడల్ ఆఫీసర్ జానకి, హెల్త్ సూపర్‌వైజర్ శిఖామణి, హేమలత, రేవతి, రెడ్డికుమారి, శకుంతల, రేవతి, రమాదేవి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

సదుం: స్థానిక ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి మంగళవారం తెలిపారు. తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 కబడ్డీ పోటీల్లో కళాశాల విద్యార్థులు బాలాజి, హర్షవర్ధన్ ప్రతిభ చూపడంతో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. విద్యార్థులు, పీఈటీ ఆంజినేయులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధుల అనుభవాలు అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ పుష్పకుమారి

సదుం: వృద్ధుల అనుభవాలు సమాజానికి ఎంతో అవసరమని రిటైర్డ్ హెచ్ఎం కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ పుష్పకుమారి మాట్లాడుతూ వృద్ధులకు ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. వారికి అవసరమైన ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: బాల్యవివాహాలు, లింగనిర్ధారణ చేసుకోవడం చట్టరీత్యా నేరమని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. బైరెడ్డిపల్లె జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వివాహ వయస్సులోనే పెళ్లి చేసు కోవాలన్నారు. చిన్నతనంలో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌహర్ సుల్తానా, ఆరోగ్యసిబ్బంది రాజేశ్వరి, ముబీనా, భారతి పాల్గొన్నారు.

కనిపిస్తే కబ్జా!

- ముందు గోనె సంచులు, ఆపై కీతలు, రేకులు
- కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు
- అర సెంటునూ వదలని కబ్జారాయుళ్లు



ట్రాన్స్‌కో కార్యాలయ ప్రహరీగోడకు ముందు వెలసిన దుకాణాలు

పలమనేరు: పట్టణంలో ఎక్కడైనా కాస్త ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు దానిపై కన్నేసి కాజేసేదాకా వదలడం లేదు కబ్జారాయుళ్లు. ప్రభుత్వ సెలవు దినాల్లో ముందుగా చిన్నపాటి కర్రలు నాటి గోనె సంచులను కట్టి ఏదేనీ దుకాణాన్ని తాత్కాలికంగా మొదలుపెడతారు. ఎవరైనా అధికారులు గమనించినా తాత్కాలికం అనుకుంటారు. ఆపై అక్కడే టెంకాయ కీతలతో చిన్నగా గుడెసెలాంటిది ఏర్పాటు చేసుకుంటూ ఓ రోజు రాత్రికిరాత్రే ఇనుప స్తంభాలు దానికి షీట్లు వేసి పక్కా చేసుకుంటారు. ఈరకంగా పలమనేరులో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్, రోడ్డుకు ఆనుకొని జరిగిన అక్రమాలపై ఆర్అండ్‌బీ, సంబంధిత శాఖ కార్యాలయాల ముందు సాగిన కబ్జాలపై అయా శాఖల అధికారులు అలసత్వమే కబ్జారాయుళ్లకు వరంలా మారింది.

కూటమి రాకతో మొదలైన ఆక్రమణలు

కార్యాలయం వద్ద ఇప్పటికే ఆక్రమణలు సాగగా కొంత ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి ఆక్రమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నాడు. మార్కెట్ కమిటీ వద్ద తాజాగా ఓ రేకుల షెడ్డు దర్శనమిస్తోంది. ఇంతకు ముందు ఇక్కడ అక్కడి ఆటోడ్రైవర్లు స్టాండుగా వాడుకుంటూ ఉండేవారు. ఇప్పుడు అక్కడ రేకులతో పక్కా నిర్మాణాలు మొదలుపెట్టారు. ఈ విషయమై స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్‌ను వివరణ కోరగా అక్కడ రేకుల షెడ్డును వెంటనే తొలగించాలని ఆదేశించామని, మున్సిపల్ అధికారులకు సైతం తెలిపామని తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి తమ స్థలంలో ఆక్రమణకు తావు లేకుండా షాపింగ్‌కాంప్లెక్స్‌ను త్వరలో నిర్మిస్తామని తెలిపారు.

మున్సిపల్ ఆస్తులకు ఎసరు

పట్టణంలోని పలు మున్సిపల్ ఆస్తులు ఇప్పటికే కబ్జాకు గురయ్యాయి. మున్సిపాలిటీలో ఆక్రమణలను అరికట్టాలని ప్రతి మున్సిపల్ సమావేశంలోనూ సభ్యులు విన్నవిస్తున్నారు. దీనిపై స్పందించి గతంలో మున్సిపల్ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. అయితే కబ్జాదారులు కోర్టులకెళ్లి దర్జాగా అదే స్థలాల్లో కొనసాగుతున్నారు. పట్టణంలో గతంలో నిర్మించిన మరుగుదొడ్లు సైతం నేడు కనిపించడంలేదు. వెటర్నరీ ఆస్పత్రి ప్రహరీగోడకు ఆనుకుని ఓ వ్యక్తి మున్సిపల్ ఆస్తిని కబ్జా చేసేశాడు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు ఎదురుగా ఓ మహిళ తనకు పట్టా ఉందంటూ హైవే స్థలంలోనే పక్కాభవనాన్ని నిర్మించేసింది. టౌన్‌ప్లానింగ్ అధికారులు అప్పుడప్పుడు నోటీసులిచ్చినా ఎవరూ భయపడడం లేదు సరి కదా నిర్మాణాలను చేసేస్తున్నారు. ఇక ఆర్అండ్‌బీకి చెందిన మెయిన్‌రోడ్డుకిరువైపులా ఇప్పటికే 50 దాకా దుకాణాలు గతంలోనే కబ్జాకు గురై ఆక్రమణదారుల అనుభవంలోకి వెళ్లాయి.

ప్రభుత్వ స్థలాల కోసం ఎన్నో టెక్నిక్‌లు....

తొలుత తాత్కాలికంగా గుడిసెలు వేసుకొని అక్కడ వ్యాపారాలు సాగించడం ఆపై రేకుల షెడ్లు వేసుకుంటున్నారు. వీటికి మున్సిపల్ అధికారులకు పన్నులు కట్టుకుంటూ వస్తున్నారు. ఆపై ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నేతలను పట్టుకుని డీల్ సెట్ చేసుకోవడం జరుగుతోంది. వారి అండతో పక్కా నిర్మాణాలకు చేపట్టేస్తారు. అదే స్థలాలకు రెవెన్యూ ద్వారా పొజిషన్ సర్టిఫికెట్లను కొందరు పొందినట్టు తెలిసింది. మున్సిపల్ అధికారులు అభ్యంతరం తెలపడం దీంతో ఆక్రమణదారులు కోర్టులకెళ్లడం రివాజుగా మారింది. ఈ వ్యవహారం కోర్టులో తేలేందుకు సంవత్సరాలు పడుతోంది. ఈలోగా అదే స్థలాల్లో ఉంటూ దుకాణాలు పెట్టుకుని సంపాదించేస్తున్నారు. ఇంత జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ విభాగం గాఢ నిద్రలోనే ఉంది. ఈ విషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డిని వివరణ కోరగా ఈ ఆక్రమణల విషయం తన దృష్టికొచ్చిందని వెంటనే తొలగించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు.



మున్సిపల్ స్థలంలో ఆక్రమణలు



ఆర్‌డబ్ల్యూఎస్ పక్కన తాత్కాలిక దుకాణాలు



ఏఎంసీ వద్ద వెలసిన రేకుల షెడ్డు

విభజన ఫలాలు అందరికీ అందాలి



ఎంపికైన విద్యార్థులతో జేవీవీ సభ్యులు, టీచర్లు

పలమనేరు: విభజన ఫలాలు అందరికీ అందాలని అప్పుడే మూఢ నమ్మకాలు లేని సమాజం తయారవుతుందని జన విజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌మూర్తి అన్నారు. ఆమేరకు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో డివిజన్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు చెకుముకి పోటీలను మంగళవారం నిర్వహించారు. ఇందులో 40 జట్లు 120మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గంగవరం జీఎల్ఎస్‌ఫామ్ బాలికోన్నత పాఠశాల, పలమనేరు, ప్రైవేటు విభాగంలో యూనివర్సల్, ఓఎల్ఎల్ పాఠశాలల జట్లు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పీఎసీ బాబు, సుదర్శనాచారి, సీతారామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కుప్పం విద్యార్థి



విద్యార్థి మౌనికను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పంరూరల్: రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల వైస్ చైర్మన్ సాగర్‌రాజ్ అన్నారు. కుప్పం డిగ్రీ కళాశాలలో బీకాం 3వ సంవత్సరం చదువుతున్న మౌనిక జిల్లా స్థాయి పోటీల్లో రెండో స్థానం సాధించి రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. మౌనికకు కళాశాల ప్రిన్సిపల్ సుధారాణి, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ముగ్గురు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కల్లూరు(పులిచెర్ల): జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక అధ్యకుడు వనపర్తి వెంకటసిద్ధులు తెలిపారు. కల్లూరు హైస్కూల్‌లో మండల స్థాయిలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. కల్లూరు హైస్కూలు నుంచి కుస్నిహాజ్, గౌతమి, దీక్షిత డిసెంబర్17న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం శ్రీవాణి, రాజేంద్ర, ఆంజనేయులు, రవీంద్ర, ధనుంజయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థి



ఎంపికైన విద్యార్థిని అనసూయ

రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ఎస్ఓ సుజాత మంగళవారం తెలిపారు. గత నెల 30న తిరుపతిలో నిర్వహించిన అండర్ -19 కబడ్డీ పోటీల్లో కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆర్.అనసూయ ప్రతిభ చూపినట్లు తెలిపారు. దీంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు చేసి 17 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వైద్యాధికారులు హర్షిత, మమత, జాలప్ప ఆస్పత్రి సిబ్బంది, సూపర్‌వైజర్లు శ్రీదేవి, రాజారెడ్డి, అయూబ్, ఆషా పాల్గొన్నారు.

కొమ్మకత్తిరింపులకు ఇదే అనువైన కాలం

పలమనేరు: మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులకు ఇది అనువైన కాలమని హార్టికల్చర్ అధికారిని లక్ష్మీప్రసూన సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం కూర్మాయిలో మంగళవారం నిర్వహించారు. ఆర్ఎస్‌కే సిబ్బంది స్పందన, కుమార్, రైతులు పెద్దబ్బ, సుబ్రమణ్యంగౌడ్ పాల్గొన్నారు.

గాంధీ జయంతిపై పోటీలు

పలమనేరు: గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు గాంధీ జీవితంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డా.బాబు బహుమతులు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపికైనట్లు హెచ్ఎం జయకుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. గత పదవ తరగతి పరీక్షలకు హాజరైన గిరీష్‌కుమార్ ప్రతిభ చూపి ప్రత్యేక ప్రతిభావంతుల కోటాలో ఇడుపుల పాయకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.


పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

రామకుప్పం: మండలంలోని బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణను అలవరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల తనిఖీ అనంతరం ఆర్డీఓ సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రెషర్ కుక్కర్ల వితరణ



వితరణ వస్తువులతో దాతలు

పలమనేరు: పట్టణ ఐసీడీఎస్ పరిధిలోని 20 అంగన్‌వాడీ సెంటర్లకు అవసరమైన ప్రెషర్‌కుక్కర్లు, వాటర్‌క్యాన్లు, మ్యాట్లను వితరణగా అందజేశారు. స్థానిక సామాజిక సేవకులు శ్రీపురం సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్టు, రత్న బయోలైఫ్ నిర్వాహకులు మంగళవారం గాంధీనగర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని వితరణ వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన శ్రీమలాలమ్మ (చాముండేశ్వరీదేవి) ఆలయంలో శరన్నవరాత్రి దసరా ఉత్సవాలు గురువారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 9 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

- జాయింట్ కలెక్టర్ విద్యాధరి
- ఆర్ఆర్ కాలనీ వద్ద భూముల పరిశీలన



బాధితులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చౌడేపల్లె: రికార్డుల ఆధారంగా పరిశీలన చేసి అర్హులకు భూమి కేటాయింపుతోపాటు పక్కా గృహాలు మంజూరుచేస్తామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. మంగళవారం బోయకొండ సమీపంలోని ఆర్ఆర్ కాలనీ వద్ద గల సర్వే నంబర్ 536, 537, 538 భూములను ఆమె పరిశీలించారు. గతంలో బోయకొండ ఎకో టూరిజానికి 20 ఎకరాల భూములు కేటాయించారు. ఆ స్థలం తమదని, పట్టాలున్నాయని గిరిజనులు ఇటీవల గ్రీవెన్స్‌డేలో వినతిపత్రం ఇచ్చారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశాల మేరకు భూములను జేసీ పరిశీలించారు. 538లో ఆరుగురికి గతంలో పట్టాలిచ్చారని, రికార్డుల ఆధారంగా పరిశీలించి న్యాయం చేస్తామని ఆమె పేర్కొన్నారు. పక్కా గృహాలు లేనివారిని గుర్తించి ఇళ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. యానాదిపాళ్యంకు సమీపంలో ఇంటి పట్టాలివ్వాలని ఎస్టీలు జేసీ దృష్టికి తెచ్చారు. ఆమె సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని, రికార్డులు పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ హనుమంతునాయక్‌ను ఆదేశించారు. మండల సర్వేయర్ గుణశేఖర్, సర్వేయర్ మురళీకృష్ణ ఉన్నారు.

నైపుణ్యం గుర్తించేందుకే చెకుముకి టెస్టులు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. బైరెడ్డిపల్లెలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఏపీఆర్ఎస్ బాలికలు హాసిని, లక్ష్మీప్రణతి, దుర్గాజాహ్నవి, సరిసహశ్రత, నవ్యశ్రీ, యామిని, కడపనత్తం ఉన్నత పాఠశాల విద్యార్థులు నవ్య, కీర్తన, రమ్య, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో అగస్థీ టెక్నో స్కూల్ విద్యార్థులు యశ్వంత్, అమ్రిన్, నిఖిత మొదటి స్థానంలో నిలిచి జిల్లా స్థాయిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టుకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ శశికుమార్, హెచ్ఎంలు నసీఫ్ జాన్, గౌహర్ సుల్తాన్, సీఆర్‌పీలు షాబుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలు జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించినట్టు హెచ్ఎం జయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం, చెరుకువారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, సదుం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని చెప్పారు. ప్రతిభ చూపినవారిని అభినందించి, సర్టిఫికెట్లు అందించినట్లు తెలియజేశారు. సర్పంచ్ ఉషారాణి, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖోఖో విజేత ముదరందొడ్డి జట్టు



విన్నర్స్‌కు కప్, మెమెంటో అందిస్తున్న నిర్వాహకులు

వి.కోట: మండలంలోని ముదరందొడ్డి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-17 ఖోఖో పోటీల్లో ముదరందొడ్డి బాలుర హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు పలమనేరు జోనల్ స్థాయి నుంచి బాలుర విభాగంలో 13 జట్లు, బాలిక విభాగంలో 15 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఇందులో బాలుర జట్టులో ముదరందొడ్డి బాలురు విజేతలుగానూ, రన్నర్స్‌గా పాముగానిపల్లి జట్టు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో పాముగానిపల్లి జట్టు విన్నర్స్‌గానూ, బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామానికి చెందిన జట్టు ద్వితీయస్థానం కైవసం చేసుకుంది. విజేతలకు ఉపాధ్యాయులు కప్‌లు, మెమెంటోలు అందజేశారు.

సైన్స్‌పై పట్టు సాధించాలి



ఎంకైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

వి.కోట: విద్యార్థి దశలోనే సైన్స్‌పై పట్టు సాధించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలచైతన్య అన్నారు. మంగళవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ టెస్టుకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ 20 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో ముదరందొడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన అర్పా, తనూజ, అంజుం, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం పరుశురామ్, సైన్స్ ఉపాధ్యాయులు జయప్ప, మోహన్‌రావ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాధితుల ఆందోళన



పట్టాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

బైరెడ్డిపల్లె: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు మంజూరు చేసిన ఇంటి పట్టాలు రద్దు చేస్తామని చెప్పడం బాధాకరమని మండలంలోని కొత్తయిండ్లు మహిళలు వాపోయారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కొత్తయిండ్లు మహిళలు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో టీడీపీ నేతలు దౌర్జన్యం చేస్తూ ఇంటి పట్టాలు రద్దు చేయడానికి నోటీసులు పంపడం దారుణమన్నారు. ఇంటి నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయని, పట్టాలను రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమవుతుందో అర్థం చేసుకోవాలని తహసీల్దార్ మాధవరావుకు వినతి పత్రం అందజేశారు.

రక్తదానాన్ని మించిన దానం లేదు



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పలమనేరు: అన్ని దానాలకంటే రక్తదానమే మిన్న అని అత్యవసర రోగులకు రక్తాన్ని అందించి వారికి ప్రాణాదానాన్ని కల్పిస్తే పుణ్యం వస్తుందని రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు క్రిష్ణమూర్తిరెడ్డి సూచించారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చిత్తూరు వారి ద్వారా స్థానిక వాణి విద్యాసంస్థల వద్ద రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం రక్తదానం చేస్తాం ప్రాణదాతలవుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్లు జయశంకర్, విజయకుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పుంగనూరు: మున్సిపాలిటీలో బదిలీపై వచ్చిన పలువురు అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా జగదీశ్వర్‌రెడ్డి మదనపల్లె మున్సిపాలిటీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అలాగే సిటీ మిషన్ మేనేజర్‌గా చిత్తూరు నుంచి సోమశేఖర్ బదిలీపై పుంగనూరుకు వచ్చారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న సీఓ అనితను మదనపల్లెకు బదిలీ చేశారు. అక్కడి నుంచి సీఓ మాధవి బదిలీపై ఇక్కడికి వచ్చి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ఆధునిక పద్ధతుల్లో పండించాలి

గుడుపల్లె: రైతులు కాలానుగుణంగా ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయ పంటలను పండించాలని వ్యవసాయాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం కంచిబందార్లపల్లె, పెద్దబదినవాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అనుబంధశాఖల ఆధ్వర్యంలో రైతులకు పంటల నాణ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు పండించిన పంటలను పరిశీలించారు.

పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్తు



మాట్లాడుతున్న వక్త

గుడుపల్లె: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామక్రిష్ణమనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.